క్లుప్తంగా

మంత్రి దయాకర్‌రావును కలిసిన టీఎన్జీఓస్ నాయకులు



హన్మకొండ అర్బన్: ఉద్యోగులు, పెన్షనర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఆయన స్వగృహంలో టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించి శుభాకాంక్షల తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేష్, రాము నాయక్, జిల్లా నాయకలు సలీం, శ్రీనివాస్, రాజమౌళి, రాజేష్ ఖన్నా, రాంప్రసాద్, పైడ రాజు, అనూప్, అశోక్, రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశ్‌కు పర్యావరణ అవార్డు



కాజీపేట: పర్యావరణ పరిరక్షణకు అహర్నిశలు శ్రమిస్తున్న ప్రకృతి ప్రేమికుడు కొలిపాక ప్రకాశ్‌కు కరీంనగర్‌కు చెందిన సద్భావన స్వచ్ఛంద సంస్థ ఉత్తమ పర్యావరణ సేవకుడిగా అవార్డును సోమవారం అందించి సత్కరించింది. 2023వ సంవత్సరానికి అవార్డును ప్రకాశ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు రావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

వయోవృద్ధుల సంఘం ఎన్నిక

రామన్నపేట: వయోవృద్ధుల సంక్షేమ సంఘం వరంగల్ సమావేశాన్ని వరంగల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొన్‌రెడ్డి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా సదానందం, సంయుక్త కార్యదర్శి డాక్టర్ రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా వీరస్వామి, కమిటీ సభ్యులుగా ఇనుగాల జోగిరెడ్డి, కోటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు.

కొమురం భీంకు నివాళి

హన్మకొండ: ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం కొమురం భీం పోరాడారని బీఆర్ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. కొమురం భీం జయంతి సందర్భంగా హనుమకొండ హనుమాన్‌నగర్ –1లో ఆయన చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మొట్ల మనోహర్, శ్రీనివాస్, కుమార్‌రెడ్డి, మాదారపు కమలాకర్, ఉదయ్‌కిరణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, రాజేందర్, రవికిరణ్, తిరుపతి, మనోజ్, వంశీ పాల్గొన్నారు.

వైభవంగా జల్సే రహమతుల్ లిల్ అలమీన్



న్యూశాయంపేట: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ ఫోర్ట్‌రోడ్డు హజ్రత్ జానుల్లా షహీద్ రహమతుల్లా అలై ఆధ్వర్యంలో జల్సే రహమతుల్ లిల్ అలమీన్ సల్లల్లాహు వసల్లమ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రధాన వక్తగా కాజీపేట దర్గా పీఠాధిపతి మహ్మద్ భక్తియార్ బియాబాని పాల్గొని మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం వరంగల్ మాషూఖ్ రబ్బానీ దర్గాకు చెందిన ఎహియాపాషా ఖాద్రీ (సోయబ్‌బాబ) మాట్లాడారు. కార్యక్రమంలో వరంగల్, ఖిలా వరంగల్, రంగశాయిపేటకు చెందిన వందలాది మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో మహ్మద్ అమరుల్లా హుస్సేనీ సయ్యద్ మసూద్, ఎం.ఏ.ఖలీఖ్ తన్వీర్, మహ్మద్ హఫీజుద్దీన్, నసీరుల్లా, సయ్యద్ ఆరీపొద్దీన్, తైసీర్, గౌజ్, హఫీజ్, మన్సూర్, లతీఫ్, ముఖబీర్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ యాత్రను విజయవంతం చేయాలి

హన్మకొండ: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేస్తున్న మాదిగల విశ్వరూప మహా పాదయాత్రకు సంఘీభావంగా జిల్లాలో జరగనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జన్ను దినేష్ మాదిగ మాట్లాడుతూ మాదిగల విశ్వరూప మహా పాదయాత్రకు సంఘీభావంగా హనుమకొండ జిల్లాలో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాదిగ, నాయకులు గంగారపు శ్రీనివాస్, మంద చిన్నరాజు మాదిగ, బొడ్డు శాంతి సాగర్, బొక్కల నారాయణ, కొట్టె కల్యాణ్, చిలుక రాజు, మంద వీరస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నర్సింగరావు



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మధు



శంకుస్థాపన చేస్తున్న అభినవ్ భాస్కర్

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బోడగుట్ట ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ సంకు నర్సింగరావు సోమవారం శంకుస్థాపన చేశారు. బోడగుట్ట ప్రాంతంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, బతుకమ్మ విగ్రహ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజీపేటలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గబ్బెట శ్రీనివాస్, మహ్మద్ అఫ్జల్, దువ్వ కనకరాజ్, దొంగల వేణు, నయీం జుబేర్, దువ్వ నరేష్, కాంపెల్లి లక్ష్మణ్, బొట్టు రాజు, మైలారం శంకర్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

నయీంనగర్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు ఆదేశించారు. బొక్కలగడ్డ ఈద్గా చర్చి కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, సుమన్‌గౌడ్, బజ్జూరి అజయ్‌కుమార్, అజాజ్ అహ్మద్, హసీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రఘు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోటలో మాజీ కార్పొరేటర్ అచ్చ లక్ష్మి, వీరేష్‌బాబు, అచ్చ విద్యాసాగర్‌కు సంబంధించిన 650 గజాల స్థలాన్ని పెరక కుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం బహూకరించారు. ఈమేరకు అందులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25లక్షలు కేటాయించగా, స్థల దాతలు, స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణతో కలిసి ఎమ్మెల్యే నరేందర్ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బోగి సురేష్, విజయ్, బిళ్ల రవి పాల్గొన్నారు.

అభివృద్ధిలో డివిజన్ ముందంజ

హన్మకొండ అర్బన్: అభివృద్ధిలో డివిజన్ ముందంజలో ఉందని 60వ డివిజన్ కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ అన్నారు. నగరంలోని 60వ డివిజన్‌లోని ముదిరాజ్‌వాడ, మిడిదొడ్డి వాడ, కాపువాడల్లో రూ.47 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాంరాజ్, డివిజన్ కమిటీ సభ్యులు ఎల్లేశ్వర్, అడప శివ, నగేష్, కుమార్, రాజు, ఓబీసీ సెల్ అధ్యక్షుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

చేగువేరా స్ఫూర్తితో సమస్యలపై పోరాటం



కేయూ క్యాంపస్: నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా స్ఫూర్తితో నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేగువేరా 56వ వర్ధంతిని సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి, కిషోర్, కరుణాకర్, అనిల్, దేవేందర్, ప్రణయ్, యువన్ పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్: ప్రపంచ విప్లవకారుడు ఎర్నెస్టో చేగువేరా 56 వర్ధంతి సందర్భంగా కేయూ మొదటి గేటు వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ అధ్యక్షుడు, సహాయ కార్యదర్శి అతిరం, స్టాలిన్ మాట్లాడుతూ చేగువేరాకు నిజమైన నివాళులర్పించడం అంటే సమస్యలపై తిరుగుబాటు చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో వినయ్, ఉదయ్, అభిషేక్, మధు, దిశ, రవళి, ప్రవళిక, మమత, తదితరులు పాల్గొన్నారు.

15రోజులుగా తాగునీటికి కటకట



నిరసన తెలుపుతున్న మహిళలు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 64వ డివిజన్ టేకులగూడెం ఎస్సీ కాలనీలో 15 రోజులుగా తాగునీరు రావడం లేదని మహిళలు వాపోయారు. ఈమేరకు నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని సోమవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఎమ్మెల్యే రమేష్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని అన్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా అయిన నీరు సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

హన్మకొండ: విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కాకతీయ మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మట్టెవాడ మాధవ్ అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లోని నక్కలగుట్టలోని కాకతీయ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల మైత్రీ మీట్ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల్లో ర్యాగింగ్ జరగకుండా, విద్యార్థుల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పేందుకు మైత్రీ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. అనంతరం చదువులో ప్రతిభ కనబరిచిన, రాష్ట్రంలో ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు అందించి అభినందించారు. డైరెక్టర్లు గుండా హరినారాయణ, దయాకర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో బీఆర్ఎస్ మోసం



డ్రెయినేజీని పరిశీలిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: అభివృద్ధి, సంక్షేమం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ ఆరోపించారు. వరంగల్ శివనగర్‌లో 34, 35వ డివిజన్ల బీజేపీ అధ్యక్షులు సామల నిరంజన్, ఇనుముల అజయ్ ఆధ్వర్యంలో పల్లవి ఆస్పత్రి నుంచి ముందుకు సాగుతున్న అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. పార్టీ ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుందర్, ఎలగందుల ప్రణయ్, సీహెచ్ శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్, తోట విజయ్, ఎరుకల రఘునారెడ్డి, బైరి మురళీకృష్ణ, మాచర్ల దీన్‌దయాళ్, బైరి నాగరాజు, మైదం వీరస్వామి, వెంకటేశ్వర్లు, అజయ్ పాల్గొన్నారు.

ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ: మాయ మాటలతో ఓట్లు దండుకోవడానికి కొంతమంది రాజకీయ నాయకులు వస్తున్నారని, ఈక్రమంలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి సూచించారు. పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మోసపూరిత మాటలను ఎవరూ నమ్మవద్దని ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

రుణమాఫీ చేయని బీఆర్ఎస్ ప్రభుత్వం

హన్మకొండ: రైతుల పంట రుణమాఫీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వన్నాల శ్రీరాములు విమర్శించారు. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని తన స్వగృహంలో ఆయన సోమవారం రాత్రి మాట్లాడారు. గత ఎన్నికల ముందు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పటి వరకు చేయలేదని అన్నారు. 24 గంటల పాటు విద్యుత్ ఇస్తున్నామని రాష్ట్రం చెబుతున్నా అది కేంద్ర ప్రభుత్వ విధానంలో భాగమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నందునే రాష్ట్రంలో పంపిణీ వ్యవస్థ బలోపేతం అయిందన్నారు. కేంద్రం రూ.900 కోట్లతో సమ్మక్క, సారలమ్మ పేరుతో ములుగులో గిరిజన యూనివర్సిటీ మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. కాగా, వరంగల్ తూర్పు అభ్యర్థిత్వంపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్, గంట రవికుమార్, అచ్చ విద్యాసాగర్ టికెట్ ఆశిస్తున్నారని చెప్పారు. ఆ విషయం అధిష్ఠానం చూసుకుంటుందని అన్నారు.

‘హరిత పితామహుడు’ స్వామినాథన్



నివాళులర్పిస్తున్న సురేష్‌లాల్, తదితరులు

కేయూ క్యాంపస్: ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశం ఈ రోజు కడుపు నిండా తినగలుగుతోందంటే దాని వెనుక హరిత విప్లవ పితామహుడు ప్రొఫెసర్ స్వామినాథన్ అసాధారణ కృషి, అనన్య సామాన్య సేవాగుణం ఉందని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌లాల్ అన్నారు. ఈమేరకు స్వామినాథన్ సంతాపసభను కాకతీయ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు సిరాజుద్దీన్ మాట్లాడుతూ 2017లో తమ సంస్థ స్వామినాథన్‌కు ‘భారత్ శాంతిదూత్’ అవార్డును ప్రదానం చేసిందని గుర్తుచేశారు. ప్రముఖ సామాజికవేత్త, సంస్థ సభ్యుడు మండవ పరశురాములు, ఈట సత్యనారాయణ, విద్యాసాగర్, సాంబశివరావు, రాజేష్ పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్న ప్రభుత్వం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ విమర్శించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 12 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారు. సమ్మెలో భాగంగా సోమవారం ఖాళీ ప్లేట్లతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రస్తుతం పొందుతున్న వేతనంపై అదనంగా మరో రూ.2 వేలు పెంచుతున్నట్లు 2022లో సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా పేర్కొన్నారని గుర్తుచేశారు. ఆ హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి, వేల్పుల సారంగపాణి, మధ్యాహ్న భోజనం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతరెడ్డి సమ్మక్క, ఎస్.రజిత, నాయకులు రాధ, శాంత, సంధ్య, సక్కుబాయి, అరుణ, సుశీల, ప్రేమలత, సంధ్య, రాజ్యలక్ష్మి, అనిత, కరుణ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

యూఎస్‌ఏకు నేరుగా విమానయాన సర్వీస్ కల్పించాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

హన్మకొండ / కాజీపేట అర్బన్: హైదరాబాద్ శంషాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు నేరుగా విమానయాన సర్వీస్ కల్పించాలని తెలంగాణ ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నూకల అంజివర్ధన్ రెడ్డి, కోశాధికారి పింగిలి వీరారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు నూకల ఉషాదేవి, ప్రతినిధులు కేతపల్లి సంపత్ రెడ్డి, వంగాల తిరుపతి రెడ్డి, బోడిగం పద్మ, కోరం లక్ష్మి, పులి సరోత్తంరెడ్డి, టీ.దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

దళితబంధులో 40శాతం వాటా ఇవ్వాలి



నయీంనగర్: రాజకీయంగా, ఆర్థికంగా రావాల్సిన వాటా తమకు కేటాయించాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం చిరంజీవి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితబంధు పథకంలో తమకు 40 శాతం వాటా ఇవ్వాలని, గృహలక్ష్మి పథకంలో వాటా ఇవ్వాలని, ఆరు అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని సూచించారు. తమ డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు స్వామి మిథల్, మధురకవి రాంబాబు, గుండె సత్యనారాయణ, భిక్షపతి పాల్గొన్నారు.

గ్రోత్ హబ్ జాబితాలో అవకాశం ఇవ్వాలి

విద్యారణ్యపురి: నీతి ఆయోగ్ రూపొందిస్తున్న గ్రోత్ హబ్ నగరాల జాబితాలో వరంగల్ నగరాన్ని ఎంపిక చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. ఈమేరకు నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్.సుబ్రహ్మణ్యంకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. హనుమకొండలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం 2047వ సంవత్సరం నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి నీతి ఆయోగ్ తీసుకుంటున్న నిర్ణయాల్లో భాగంగా దేశవ్యాప్తంగా 20 నగరాలను గ్రోత్ హబ్‌లుగా ఎంపిక చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే వారణాసి, సూరత్, ముంబై, విశాఖ నగరాలను ఎంపిక చేశారని చెప్పారు. తెలంగాణ నుంచి హైదరాబాద్ లేదా వరంగల్‌ను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.


పదోన్నతి పొందిన అధికారులకు సన్మానం

ఎంజీఎం: జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డీఐఓగా పనిచేస్తూ పదోన్నతిపై భూపాలపల్లి డీఎంహెచ్‌ఓగా వెళ్తున్న చల్లా మధు, వరంగల్ డీఎంహెచ్‌ఓ కార్యాలయం సూపరింటిండెట్‌గా నియమితులైన మంచిక ప్రమోద్‌కుమార్‌ను డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సంఘాల ఐక్య వేదిక, తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో టీజీపీఏ, పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయీస్ యూనియర్ నాయకులు కొప్పు ప్రసాద్, ఎండీ.ఫయాజ్, పద్మజాదేవి, అనిల్‌కుమార్, నవీన్, రాజ్‌కుమార్, నర్సింహరెడ్డి, ప్రసాద్, ప్రకాశ్‌రెడ్డి, వెంకటరమణ, సంపత్, శ్రీనివాస్, రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాలు పొందిన వారికి..

హన్మకొండ: ఇటీవల విడుదలైన టీఎస్ఎస్పీ ఎస్సై, కానిస్టేబుల్, వివిధ శాఖల్లో కొలువులు సాధించిన అభ్యర్థులను హనుమకొండలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలతో పాటు అన్ని వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శశిజాదేవి, గ్రేడ్ –1 అధికారి కరుణ కుమారి, గ్రేడ్ –2 అధికారి మల్సూర్, పురుషోత్తం రాజు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, సిబ్బంది కుమారస్వామి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి సహస్ర దీపాలంకరణ పూజలు



కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు సోమవారం సహస్ర దీపాలంకరణ పూజలు జరిపించారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడికి నిత్య కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తూర్పులో బీఆర్ఎస్‌వీ కుటిల రాజకీయాలు

కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌వీ నాయకులు కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఎమ్మెల్యే నరేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన 36వ డివిజన్ చింతల్‌కు చెందిన బీజేపీ నాయకులు సోమవారం తిరిగి ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ప్రదీప్‌రావు ఆహ్వానించారు.

మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ తూర్పుకోటలో బల్దియా ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలను మహిళలకు స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి సర్కారు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా సీఓ ప్రవీణ్, ఆర్పీలు రాజమణి, కవిత, కల్పన, లత, జాన్సీ పాల్గొన్నారు.

63వ డివిజన్‌లో..

కాజీపేట: 63వ డివిజన్ కూరగాయల మార్కెట్ ఆవరణలోని ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మమత, ఉమ, నజీమ, సరోజన, విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

46వ డివిజన్‌లో..

మడికొండ: 46వ డివిజన్ మడికొండ, రాంపూర్ గ్రామాల్లో మహిళలకు కార్పొరేటర్ మునిగాల సరోజన బతుకమ్మ చీరలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, మునిగాల కరుణాకర్, వల్లెపు ఉపేందర్, నర్మెట భిక్షపతి, కొలిపాక కుమార్‌బాబు, పల్లపు కుమార్‌రాజా, రాసమల్ల వెంకటస్వామి, దేవేందర్, కాశేశ్వరపు రాజేందర్, గంగారపు వీరేష్, రాసమల్ల రాజు, ఈదురు అనిల్, అబ్బసాయిలు, రాంపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు రవి, గడ్డం రాజు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజారెడ్డి

విద్యారణ్యపురి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రీజనింగ్, అప్టిట్యూడ్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్స్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు. కళాశాలలో టీఎస్‌కేసీ, టాస్క్ ఆధ్వర్యంలో రీజనింగ్, అప్టిట్యూడ్ నైపుణ్యాల అభివృద్ధిపై రెండు రోజులపాటు కొనసాగే కార్యశాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కమ్యూనికేషన్ స్కిల్స్ వ్యక్తుల, సంస్థల మధ్య సానుకూల వాతావరణం పెంపొందిస్తే, రీజనింగ్ అప్టిట్యూడ్ మెలకువలు.. విద్యార్థులు, ఉద్యోగుల పని సామర్థ్యాన్ని వేగవంతం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో శిక్షకుడు రాజేష్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ లింగారెడ్డి, ఎన్‌సీసీ అధికారి ఓంకార్, టీఎస్‌కేసీ మెంటార్ సాగర్ పాల్గొన్నారు.

సముచిత స్థానం కల్పించాలని వినతి



చీఫ్ విప్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: జర్నలిస్టులకు అన్ని చోట్ల సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఆవరణలో ప్రభుత్వ చీఫ్ విప్ ,దాస్యం వినయభాస్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రింట్ మీడియాలో పనిచేస్తున్న పాత్రికేయుల ఉనికి ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఏర్పాటు చేస్తున్న విలేకరుల సమావేశంలో వివక్షకు గురవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ కే.కృష్ణకుమార్, కో కన్వీనర్లు కంకణాల సంతోష్, కట్కూరి రవికుమార్, బాధ్యులు చింతల సత్యనారాయణ, ఉట్కూరి సాయిరాం, గౌరవ సలహాదారులు నాయకపు సుభాష్, బొల్లారం సదయ్య, జర్నలిస్టులు జగన్, ప్రశాంత్, రాజ్‌కుమార్, డాక్టర్ విష్ణువర్ధన్, గుండె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరపతి సంఘాలతో ఆర్థిక పరిపుష్టి



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

హసన్‌పర్తి: పరపతి సంఘాలతో ఆర్థిక పరిపుష్టి సాధ్యమని ఫ్రెండ్స్ సొసైటీ అధ్యక్షుడు చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. ఫ్రెండ్స్ సొసైటీ 24వ వార్షికోత్సవాన్ని హసన్‌పర్తిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమవంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి రేబెల్లి ఓం ప్రకాష్, ఉపాధ్యక్షులు గౌరిశెట్టి కృష్ణమూర్తి, కోడెల సుధాకర్, కోశాధికారి గంట వెంకటేశ్వర్ రెడ్డి, గౌరవ సలహాదారులు పావుశెట్టి శ్రీధర్, డాక్టర్ సత్యనారాయణ, సభ్యులు ఆరెల్లి వెంకటస్వామి, సతీష్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

చింతగట్టులో జేకే రెస్టారెంట్ ప్రారంభం



పూజ చేస్తున్న నిర్వాహకులు

హసన్‌పర్తి: నగరంలోని చింతగట్టు క్యాంప్ వద్ద జేకే రెస్టారెంట్‌ను సోమవారం ప్రారంభించినట్లు రెస్టారెంట్ నిర్వాహకుడు బైహిందొరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో, సర్వాంగులతో రుచికరమైన ఫుడ్స్‌తో ఇండియన్, చైనీస్ తందూరీ, బిర్యానీ వంటి రుచికరమైన వంటకాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సువిశాలమైన ప్రత్యేక ఏసీ క్యాబిన్లు, గేట్ టుగెదర్, విందుల కోసం హాళ్లు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో సునీల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, కవితారెడ్డి, సత్యం, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.